ఆరోగ్యం.. ఆనందం

- ఓపెన్ జిమ్‌ల వద్ద నిత్యం రద్దీ
- వ్యాయామం చేస్తున్న యువత
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హయాంలో ఏర్పాటు

సీతానగరం: సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం చాలా అవసరం. నిత్యం వ్యాయామం చేస్తున్న వారికి రోగాలు చాలా దూరంగా ఉంటాయి. గతంలో ప్రజలు కష్టపడి పనులు చేసేవారు. వాటి వల్ల శారీరక శ్రమ కలిగి చాలా ఆరోగ్యంగా ఉండేవారు. కానీ నేడు కాలం మారింది. చెమట బొట్టు చిందకుండా పనులు జరిగిపోతున్నాయి. వ్యవసాయంతో పాటు వివిధ పనులలో యంత్రాలు ప్రవేశించాయి. కాలానికీ అనుగుణంగా టెక్నాలజీ చాలా అవసరం. అదే సమయంలో శారీరక శ్రమ లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. యువత కూడా వ్యాయామం చేయకపోవడం వల్ల చిన్న వయసులోనే ఉబకాయంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో గ్రామాలలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. వీటిని ప్రజలు బాగా ఉపయోగించుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జిమ్‌ల వద్ద పెద్దలతో పాటు యువత వ్యాయామం చేస్తూ కనిపిస్తున్నారు.



మునికూడలిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

మాజీ ఎమ్మెల్యే రాజా చొరవతో..

వ్యాయామంపై ప్రజలకు అవగాహన ఉన్నా.. చేయడానికి వసతులు లేవు. డబ్బులు ఖర్చుపెట్టుకుని ప్రైవేటు జిమ్‌లకు వెళ్లే వీలు ఉండదు. కాబట్టి ఆసక్తి ఉన్నా వ్యాయామం చేయలేకపోయేవారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో గ్రామాలలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయడం వల్ల వారికి చాలా ప్రయోజనం కలుగుతోంది. దీంతో వ్యాయామ శాలలు ఆరోగ్య నిలయాలుగా మారాయి. వీటికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఆర్థిక సహకారం అందించింది. దీని ద్వారా రాజానగరం నియోజకవర్గంలో 15 జిమ్‌లు ఏర్పాటు చేశారు. సీతానగరం, వెదుళ్లపల్లి, బొబ్బిల్లంక, మునికూడలి, కోరుకొండ మండలం మధురపూడి, కోటి కేశవరం, గాడాల, రాజానగరం మండలం నరేంద్రపురం, తోకాడ, లాలాచెరువు తదితర గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను నెలకొల్పారు.

13 రకాల పరికరాలు

ఓపెన్ జిమ్‌లో 13 రకాల వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 30 రకాల ప్రయోజనాలు పొందవచ్చు. ఈ పరికరాలతో వ్యాయామం చేయడం వల్ల శరీరంలో ఎముకలు గట్టిపడడం, ఊబకాయం తగ్గడం, బరువు తగ్గడం తదితర ప్రయోజనాలు కలుగుతాయి. ఒక్కో ఓపెన్ జిమ్‌కు రూ.25 లక్షలు ఖర్చు చేశారు. చుట్టూ ఫెన్సింగ్‌తో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళల్లో సైతం వ్యాయామం చేసుకునేందుకు వీలుగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించారు.

అభినందనీయం


గ్రామాలలో ప్రజలకు వ్యాయామంపై అంతగా ఆసక్తి ఉండేది కాదు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో నిత్యం వ్యాయాయం చేసేవారు పెరిగారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో వీటిని ఏర్పాటు చేయడం అభినందనీయం. వ్యాయామం వల్ల ఆరోగ్యంతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

– అంబటి రాజు, మునికూడలి

మానసిక ప్రశాంతత


ఓపెన్ జిమ్‌లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా ఉండే అవకాశం కలుగుతుంది. ఆరోగ్యం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. గ్రామాలో వీటిని ఏర్పాటు చేసి ప్రజలను వ్యాయామంపై చైతన్యపర్చడం మంచి విషయం.

– సాదె చంటిబాబు, ముగ్గళ్ల

రోగ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మధురపూడి: రోగాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కమ్యూనిటీ పారామెడిక్స్ (పీఎంపీలు) కృషి చేయాలని రాజమహేంద్రవరం జీవీఎస్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్టు డాక్టర్ కె.రామ్‌గోపాల్ తేజ అన్నారు. కోరుకొండలో పీఎంపీ అసోసియేషన్ మండలాధ్యక్షుడు కుంచే వినోద్ అధ్యక్షతన బుధవారం సదస్సు జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సూరిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సత్కారం

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో స్థానిక మదర్ థెరిస్సా సేవాసమితి వ్యవస్థాపకుడు ఉందుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా వృద్ధులను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ వితరణ

సీతానగరం: అమెరికాలో ఉంటున్న పసుమర్తి వెంకట సునీల్ కుమార్ బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.17 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను వితరణ చేశారు. తన బంధువులైన ఉపాధ్యాయులు హేమంత్ కుమార్, మాచారమ్మ దంపతుల ద్వారా హెచ్‌ఎం కోలా సత్యనారాయణకు బుధవారం అందజేశారు. ఇదే స్కూల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాచారమ్మ రూ.15 వేలు విలువైన నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

క్లుప్తంగా

నూతన ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న రవిచంద్రకుమార్

బిక్కవోలు: మండల ఎస్‌ఐగా వి.రవిచంద్రకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తానన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఆయన కృష్ణా జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

23న గ్రామ సభలు

పెదపూడి: మండలంలోని 20 సచివాలయాల్లో ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం పెదపూడిలో మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకం, ఇతర అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక అధికారులు నియమించామన్నారు.

నేడు ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం

రంగంపేట: మండల పరిధిలోని వీరంపాలెం గ్రామంలో గురువారం ఉదయం ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఉద్యానాధికారి కె.దివ్యశ్రీ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పతంజలి ఫుడ్స్, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పతంజలి ఫుడ్స్ ప్రతినిధులు, మండలంలోని ఆయిల్‌పామ్ సాగు రైతులు పాల్గొంటారన్నారు.

దోమల నివారణకు ఎబెట్ మందు పిచికారీ


ఈలకొలనులో ఎబెట్ మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

రంగంపేట: మండలంలోని ఈలకొలను గ్రామంలో సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో మురికి కాలువల్లో పూడిక తొలగించి దోమల నివారణకు కాలువలకు ఇరువైపులా ఎబెట్ మందు పిచికారీ చేయించారు. అదేవిధంగా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సర్పంచ్ సత్యనారాయణ సూచించారు.


23న విద్యుత్ సరఫరాకు అంతరాయం

బిక్కవోలు: మండలంలోని పందలపాక, రంగాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం ఈ నెల 23వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంకుదురు, ఆరికరేవుల, మొబ్లూరు గ్రామాల్లోను, మర్రిపూడి అగ్రికల్చరల్ లైన్‌లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వృక్షశాస్త్రం(బోటనీ), జంతుశాస్త్రం(జువాలజీ), వాణిజ్యశాస్త్రం(కామర్స్) సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 23వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

ధరల నియంత్రణ కమిటీ సభ్యుడిగా అనంతరావు


రాజమహేంద్రవరం సిటీ: జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యుడిగా న్యాయవాది గొట్టిముక్కల అనంతరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు. ప్రతి నెలా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై ధరల నియంత్రణపై తీసుకున్న చర్యలను పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ నిత్యావసరాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం


శాటిలైట్ నమూనాతో ఎంఈవో స్వామినాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు ఎం.వీరభద్రరావు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. మోడల్ మేకింగ్, స్పేస్ క్విజ్, పోస్టర్ మేకింగ్ తదితర విభాగాల్లో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వీటిని మండల విద్యాశాఖాధికారి కె.స్వామి నాయక్ పర్యవేక్షించారు. మోడల్ మేకింగ్ విభాగంలో వెదుళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన మనోహర్, మురళీ, పోస్టర్ మేకింగ్ విభాగంలో సీతానగరం హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ దుర్గానందిని, క్విజ్‌లో రఘుదేవపురం విద్యార్థులు ప్రసాద్, జాహ్నవి ఎంపికయ్యారు. వీరందరూ రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ స్కూల్లో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్విజ్ నిర్వేతలుగా ఉపాధ్యాయులు కె.సతీష్ బాబు, మోహన్ వ్యవహరించారు.

అంతర్గత క్రీడా పోటీల ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపడాల పెదపుల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో అంతర్గత క్రీడా పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు బుధవారం ప్రారంభించారు. క్రీడా పోటీల్లో కబడ్డీ, చదరంగం, స్కిప్పింగ్, రన్నింగ్, త్రోయింగ్, జంపింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్తిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం లంకూరుకు చెందిన దూళ్ల మహాలక్ష్మిపై దాడి చేసిన మాగాపు దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.ఫణి మోహన్ బుధవారం తెలిపారు. ఈనెల 19న లంక భూమిలో పశువులు కాసుకుంటున్న మహాలక్ష్మి, దుర్గాప్రసాద్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనితో మహాలక్ష్మిపై దుర్గా ప్రసాద్ కర్రతో దాడి చేశాడు. దీంతో మహాలక్ష్మి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తీవ్ర గాయాలతో గోదావరి గట్టు వద్ద పడి ఉన్న మహాలక్ష్మిని అతడి కుటుంబ సభ్యులు చూసి, వెంటనే సీతానగరంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజానగరంలోని జీఎస్‌ఎల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైనింగ్ హాలుకు శంకుస్థాపన

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న డైనింగ్ హాలుకు జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. వాష్ ఇన్‌స్టిట్యూట్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో రూ.12 లక్షల వ్యయంతో దీన్ని నిర్మిస్తున్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న ఈ సంస్థ రాజానగరం, కోరుకొండ, కడియం మండలాలను దత్తత తీసుకుని విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. కాగా.. డైనింగ్ హాలు నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యంగా రూ.1.20 లక్షలు విరాళం ప్రకటించిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాయుడు శ్రీనివాస్‌ను సత్కరించారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి


సాగు మెళకువలపై అవగాహన కల్పిస్తున్న ఏవో మణిదీప్

పెదపూడి: రైతులకు సాగుకు సంబంధించిన మెళకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో టీవీఆర్ మణిదీప్ అన్నారు. దోమాడ గ్రామంలో బుధవారం ఐఎన్‌డీఏ జీపీపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యత, అధిక దిగుబడులు సాధించడానికి సకాలంలో సస్యరక్షణ చేపట్టాలన్నారు. ఎరువుల యాజమాన్యం, వరి కాండం తొలుచు పురుగు జీవిత చక్రం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, సేంద్రియ వ్యవసాయ అధికారులు, జెడ్‌బీఎన్‌ఈ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ నాగమురళీ

మధురపూడి: కోరుకొండ మసీదు పక్కనే గల బ్యాంకర్స్ షాపులో మార్చిలో జరిగిన చోరీకి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం సీఐ అడపా నాగమురళీ ఆ వివరాలు వెల్లడించారు. నిందితులైన కోరుకొండ మండలం పశ్చిమ గానుగూడెం గ్రామానికి చెందిన బొమ్మతి సుధీర్ కుమార్, కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరి గ్రామం అరిపాలం వీధికి చెందిన పులిదిండి కిరణ్ కాపవరం గ్రామశివారులో తిరుగుతుండగా అరెస్టు చేశామన్నారు. చోరీ చేసిన బంగారాన్ని వరంగల్ జిల్లా హన్మకొండ రాజుపేటలోని ముత్తూట్ ఫైనాన్స్, కెనరా బ్యాంకుల్లో నిందితులు తాకట్టు పెట్టినట్టు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో వారి నుంచి 42.5 గ్రాముల బంగారం ఆభరణాలు, 450 గ్రాముల వెండి వస్తువులను రికవరీ చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్సై డి.ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న మరో లారీ


ఘటనా స్థలంలో లారీలు

మధురపూడి: జాతీయ రహదారి 215 ఈపై కోరుకొండ మండలం జంబూపట్నం పరిధిలో అయ్యన్నగళ్ల సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కోరుకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి కాకినాడ వెళ్తున్న ఊక లారీని డ్రైవర్ రోడ్డ పక్కన నిలిపాడు. దానిని గోకవరం నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళుతున్న మరో లారీ వెనక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో వెనుక లారీ ముందుభాగం ధ్వంసమైంది. దానిలోని ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే ప్రదేశంలో మంగళవారం ఒకరు మృతి చెందడం, బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయాలని, పోలీసు గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.

గైట్ కళాశాలకు అవార్డులు


అవార్డులు అందుకున్న అధ్యాపకులను అభినందిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: జేఎన్‌టీయూకే 17వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక గైట్ కళాశాలకు పలు అవార్డులు లభించాయి. గైట్ అటానమస్ కళాశాల నాక్ ఏ ప్లస్, ప్లస్ అక్రిడేషన్‌తోపాటు వరసగా ఆరోసారి ఎన్‌బిఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ సాధించింది. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీగా ఆవిర్భవించిన సందర్భంగా అప్‌గ్రేడేషన్ అవార్డును రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ డాక్టర్ రామ్మోహనరావు, జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ అందజేశారు. అలాగే జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల పరిధిలో గైట్ అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ బి.సుజాత ఉత్తమ అధ్యాపక పురస్కారాలను అందుకున్నారు. వారిని జీజీయూ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తదితరులు అభినందించారు.


ప్రియదర్శిని విద్యార్థులకు మందుల వితరణ


విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న పీఎంపీ అసోసియేషన్ నాయకులు

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో విద్యార్థులకు కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఆశ్రమ నిర్వాహకులు స్వప్నవర్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆశ్రమంలో పిల్లలకు మందులు పంపిణీ చేసిన పీఎంపీ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, రాజమహేంద్రవరం అధ్యక్షుడు రహమాన్ ఖాన్, కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం


రాజానగరంలోని తెరచి ఉన్న దుకాణాలు


పెదపూడిలో ఉన్నత పాఠశాలను మూయిస్తున్న ఆందోళన కారులు

పెదపూడి: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత, మాలమహానాడు సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ మండలంలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. మండలంలోని పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, పైన, దోమాడ, రామేశ్వరం తదితర గ్రామాల్లో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసి వేయించారు.

రంగంపేట: బంద్ సందర్భంగా బుధవారం స్థానిక మాల మహానాడు జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, పలు వ్యాపార దుకాణాలు, హోటళ్లను మూసి వేయించారు.

బిక్కవోలు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన బంద్‌లో భాగంగా వ్యాపార సంస్థలు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించివేశారు. మాల మహానాడు కార్యకర్తలు గ్రామాల్లోని రహదారులపై బైఠాయించి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాజానగరంలో బంద్ పాక్షికం

రాజానగరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన భారత్ బంద్ నియోజకవర్గంలో పాక్షికంగా సాగింది. బంద్ పిలుపుతో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వ్యాపార, వాణిజ్యకలాపాలు యథాతథంగా జరిగాయి. బస్సులు, ఆటోలు మామూలుగానే తిరిగాయి.

కోరుకొండలో రాస్తారోకో

మధురపూడి: కోరుకొండలో బంద్ ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. ఈ సందర్భంగా కోరుకొండ – గానుగూడెం వరకూ బైక్ ర్యాలీ జరిగింది. బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. బూరుగుపూడి మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టా కృష్ణ మాట్లాడుతూ వర్గీకరణను అందరూ వ్యతిరేకించాలన్నారు. గుమ్ములూరు సర్పంచ్, మాజీ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కోరుకొండ ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, నాయకులు పండా అబ్బులు, కొండేటి యేసురాజు, ఈతకోట చిన బాబు తదితరులు పాల్గొన్నారు.

మండుటెండ.. కుండపోత

- మండుతున్న ఎండ, అంతలోనే వాన
- విచిత్ర వాతావరణంతో ప్రజల అవస్థలు

సీటీఆర్‌ఐ: ప్రస్తుతం వాతావరణం చాలా విచిత్రంగా ఉంటోంది. అసలు ఏ కాలమో తెలియని విధంగా ప్రవర్తిస్తోంది. ఉదయం నుంచే సూర్యుడు ఎండతో బెంబేలెత్తిస్తున్నాడు. వేసవి కాలం మాదిరిగా విజృంభిస్తున్నాడు. అంతలోనే వరుణుడు రంగంలోకి దిగుతున్నాడు. దాదాపు గంటసేపు వాన కురిపిస్తున్నాడు. ఆయన డ్యూటీ అయ్యాక మళ్లీ సూర్యుడు ప్రత్యక్షమవుతున్నాడు. వాతావరణంలో వచ్చిన మార్పులలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. జ్వరాలు, ఒళ్లనొప్పులు, దగ్గు తదితర రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.


ఆర్ట్స్ కళాశాల రోడ్డులో బుధవారం ఉదయం 9.45 గంటలకు ఎండలో ప్రయాణం

ఆహ్లాదం కరవు

ఎండకాలంలో భానుడి వేడితో అల్లాడిన ప్రజలు వర్షాకాలంలో ఆహ్లాదకర వాతావరణంతో సేదతీరుతారు. గతంలో ఎప్పుడు ఇలాగే జరిగిది. వర్షాకాలంలో ఎండ కాసినా అంత ప్రచండంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఒక పక్క వరుణుడు, మరోపక్క భానుడు పోటాపోటీగా ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఉదయం నుంచే ఎండ రావడంతో ఉక్కపోత ఎక్కువై పోతోంది. వేసవి కాలం మాదిరిగా ఇళ్లలో ఏసీలు పనిచేయాల్సి వస్తోంది. ఇంతలోనే కుండపోతగా వర్షం కురుస్తుంది.

మార్పులకు కారణమిదేనా..

వాతావరణంలో ఇంత మార్పు రావడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్ అని నిపుణులు చెబుతున్నారు. దాని వల్ల ఇలాంటి విచిత్ర వాతావరణం నెలకొందన్నారు. నేలపై పచ్చని చెట్లు లేకుండా నరికివేయడంతో ఈ పరిస్థితిని ప్రధాన కారణమని స్పష్టం చేశారు. గతంలో నగరాలలో చెట్లను నరికివేశారని, ఇప్పుడు ఓ మాదిరి పెద్ద గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. చెట్లను నరికివేయడంతో ఎండలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.


అదే రోడ్డులో ఉదయం 9.50 గంటలకు మేఘావృతమైన ఆకాశం

రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడం, తోటలు, పచ్చని పొలాలను నాశనం చేసి లేఅవుట్లు వేయడం, కొండలను కొట్టేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందన్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రత 33 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అవుతోంది. గాలిలో తేమ శాతం 80 శాతం నుంచి 95 శాతం వరకూ ఉంటోంది. దీంతో ఉక్కపోత బాగా ఎక్కువైంది.

పెరిగిన ఏసీల వినియోగం

గతంలో వేసవి కాలంలోనే ఏసీలను బాగా ఉపయోగించేవారు. మిగిలిన కాలాలలో వాటి వినియోగం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కాలానికి సంబంధం లేకుండా ఏసీలు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలమైనా ఏసీల వినియోగం బాగా పెరిగింది. ఎండలు బాగా పెరిగిపోవడంతో వాటి వాడకం తప్పనిసరి అయ్యింది. ఇక రోడ్ల పక్కన వ్యాపారం చేసుకున్న చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే ఎండ రావడంతో ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. అంతలోనే వాన కురవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన వస్తువులను పేర్చి విక్రయాలు జరిపేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాన కురిసినప్పుడు వాటిని సర్దుకోవడం చాలా ఇబ్బందిగా మారింది. అనుకోకుండా వర్షం కురవడంతో ప్రజలు బయటకు రావడం లేదు. దీనివల్ల వ్యాపారాలు కూడా సక్రమంగా జరగడం లేదు.


వర్షంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ప్రయాణికులు (ఫైల్)